*

# సుబ్బమ్మ పునస్సంధానం
## అను
# గురువుకి శిష్యుడే గుర్వైన చురకల పద్ధతి

నండూరి విఠల్

పేరింభొట్లు అనే గురువుకి పిడతంభొట్లు అనే శిష్యు డున్నాడు.

గురుదేవుల ఉపన్యాసాన్ని శిష్యపరమాణువు భక్తి శ్రద్ధలతో ఆలకిస్తుండగా తెర తొలగించబడుతుంది.

"బావుంది శిష్యా! మహా రచయితవు కావాలనే నీ కోరిక తప్పకుండా ఈడేరుతుంది. అందుకు ఓ చిట్కా చెప్తా - శ్రద్ధతో వినుము."

"వొళ్ళంతా చెవులై పోయాయి స్వామీ. శలవివ్వండి!"

"శిష్యా! ఇప్పటి జనానికి నువ్వేం చెప్పదల్చుకున్నా ఒకే ఒక భేషైనపద్ధతుంది దాన్ని చురకల పద్ధతి అంటారు ప్రాజ్ఞులు. నువ్వు విశిష్టాద్వైత మతాన్ని గురించే మహా జనానికి చెప్పదల్చు కున్నావనుకో, ఈ చురకల పద్ధతే అవలంబించాలి. ఆత్మా పరమాత్మా వగైరా భారీ విషయాలైనాసరే ఈ పద్ధతిలోనే చెప్పాలి. సాంఘిక దురాచారాలు, సర్కస్ కంపెనీలు, సాహిత్య విమర్శలు - అఖరికి త్రాగుడు మానండి, రోడ్డుకు ఎడం పక్కగా నడవండి. ఇత్యాది ముక్కలు—ఏది జనానికి ఎక్కాలన్నా ఈ చురకల పద్ధతే నిన్ను ఆదుకునేది."

"కథలన్నా, నాటకాలన్నా, నవలలన్నా- అలాటివి ఓ పాతికన్నా రాయాలనుంది స్వామి! ఎలా మొదలు పెట్టాలో - ఆ కిటుకు చెప్పండి. పాదులా అల్లుకు పోతాను."

"శిష్యా! చురకల పద్ధతిలో మొదటి సూత్రం. నువ్వేం చెప్పదల్చుకున్నా ముందొక యౌవన మదవతి అయిన స్త్రీనీ ఆ వెనకాతలే ఓ పురుషుణ్ణీ ప్రవేశపెట్టు. వాళ్ళకి పేర్లు పెట్టినా పెట్టకపోయినా కొంప మునిగిందిలేదు. వాళ్ళు భార్యాభర్తలు మాత్రం కాకూడదు.''

"ఎందుకని గురుదేవా?"

"భార్యాభర్తల మధ్య శృంగారం ఎక్కడుంటుంది నాయనా? ఉన్నా, అది అధమాధమ శృంగారం కిందనే లెక్క! అయిందా? 'ఆమె కళ్లు నిషాతో ఎర్రబడినై. అతని బుగ్గలు రాగరంజితాలయాయి. అతని కళ్లు ఆమె కళ్ళల్లో నవ్వాయి. అతని చేతులు ఆమెను...' ఇలా ప్రారంభించు."

వళ్ళు దగ్గరుంచుకొని చదవటం మొదలు పెడ్తాడు పాఠకుడు.

"అతని మోహం ఆమె హృదయంలో చలికాచుకుంటూ బయటి ప్రపంచాన్ని మరచిపోయింది. అంతలో ఆమె భర్త అక్కడికి వచ్చి తలుపు తట్టాడు..."

పడుకుని చదువుతున్న పరంధామయ్య అనే పాఠకుడు లేచి ఊపిరిబిగబట్టి పిల్లి మొగ్గవేసి కూర్చుని దడదడమంటున్న గుండెల్ని అదిమి పట్టుకుని సాగిస్తాడు. పఠనం. పెనం చుర్రుమందన్న మాట. ఇంక అట్టు వేయటమే తరువాయి. దీన్నే చురకల పద్ధతి అంటారు పండితులు - తలకెక్కిందా శిష్యా?"

"ఆమె భర్త ఆ తర్వాత ఏం చేశాడు స్వామీ?"

"ఆమె శరీరం కోర్కెల ముద్దయిపోయింది. కౌగిలిలో స్వర్గద్వారాలు తెరుస్తున్న ప్రియుడు, నరకద్వారం తలుపులు బాదుతూ గుమ్మందగ్గర భర్త? ఎటుదారి? ఏమిటి గమ్యం?? కాన్‌ఫ్లిక్ట్ అంటారు చూడూ అలాటిది పోగుచెయ్యాలి. ఇక్కడింకో చిక్కు పెట్టాలి. ఆమె మీద పాఠకుడికి సానుభూతి కలిగించాలి. ఆమె కాలు జారితేనే ధర్మం అనిపించాలి. ఇదెలాగు? భర్తపై వెగటు కలిగించాలి. ఆ భర్త ముదుసలి, లావైనవాడు, వికారంగా ఉంటాడు, ఎప్పుడూ భార్యను కొడతాడు,

రాగవిహీనుడు. రసవిహీనుడు. ఇలాగే వర్ణించు. ఇహ పరాయి పురుషు డున్నాడే మన హీరో - అతని దేహ సౌందర్యాన్ని సమ్మోహనకరంగా వర్ణించు. అతన్ని చూస్తే పురుషులే ప్రేమిస్తారు అను. అతన్ని చూసిన ఏస్త్రీ అయినా అతనికి లొంగి పోకుండా వారంరోజులైనా నిలవలేదు. అనే నీతిని తేల్చు. అలాంటిది మన హీరోయిన్ - పదునారేండ్ల పాలపొంగులా బుసలు కొట్టే యౌవనంతో - కోర్కెలన్నింటిని పీట ముడివేసి హృదయంలో దాచుకున్న అందాల రాణి. జరాభారంతో కృంగి కృశించిపోతున్న భర్త బారినుండి బయట పడి, నగలన్నీ త్యాగంచేసి అతనితో-తన ప్రియునితో చంద్రమండలానికి లేచిపోవటం ధర్మసమ్మతం కాదా? అని పాఠకుడిని సూటిగా ఓ ప్రశ్న వేయి. ఆ తర్వాత మూడు పేజీలు చక్కలిగింతల సంభాష ణలు వ్రాయి. ఎలాగంటే? అతనంటాడూ:

"సుబ్బమ్మా! మీ ఆయన వచ్చిన ట్టున్నాడు."

"రానీ"

"చూస్తే?"

"చూడనీ"

"చంపితే?"

"చంపనీ?"

ఆమె కనుకొలకుల అరవింద గింజ లంత భాష్పములు నిలిచినవి. సుబ్బా ఁటూ అతనామెను దగ్గరకు తీసుకుని - ఆమె హృదయం ఆనంద తరంగాలపై తేలింది. పాలసముద్రమై పొంగి నింగి నంటింది. నీ చేతుల్లో చావటం కంటె నాకేఁకావాలి సుబ్బారాయుడూ, అంటూ అతన్ని వీపుకు హత్తుకుంది. ఇలా చెప్త న్నట్లు కాకుండా తమాషాగా వాళ్ళిద్దరి పేర్లూ చెప్పించాలి. ఇదొక టెక్నిక్. చురకల పద్ధ తిలో రెండో ఘట్టం -

నువ్వు వేదాలూ ఉపనిషత్తులూ నమిలి మింగటం యిష్టంలేక కక్కేసినట్లు - ఓ భ్రమ కలగాలి పాఠకుడికి. వేదకాలంలోనూ ఇంతే అను ఎక్కడో ఒకచోట ఉపనిషత్ వాక్యం ఒకటి ఎలాగైనా సంపాదించి ఏం తోచనప్పుడు కథ మధ్యలో విసిరికొట్టు. చదివేవాడి బుర్ర తిరిగిపోతుంది. దీనికి తోడుగా అయిదారు భాషల్లో నీకు అద్వితీయ మైన పాండిత్యం ఉన్నట్టు జనానికి భ్రమ కలిగించాలి. తాత్పర్యం నీమీద జనానికి మహా గురుభావం కలగాలి. అప్పుడే నువ్వేం చెప్పినా వింటారు. కథ చెప్తూ మధ్యలో ఆపి కాళిదాసు శృంగార నాయ కిలా ఆ సుబ్బమ్మ అతన్ని చూస్తూ- అను- లేదా భవభూతి అన్నట్లుగా అని ఓ వాక్యం ప్రారంభించి, నీకు చేతనైనట్టు విరిచావతల పారేయ్. అడపాతడతా అరిస్టాటిల్ తత్వం, ప్లాటో సిద్ధాంతం, తిక్కన నాట కీయత, షా చమత్కారం, శ్రీనాథుని సీసాలు, మాథ్యూ ఆర్నాల్డ్ వ్యాఖ్యానం, చైనా సరిహద్దు తగాదా, సాహిత్య అకా డమీ, హీనయాన మహాయానాలు, సుబ్బమ్మ తొడుక్కున్న జాకెట్టు, ఆత్మాపరమాత్మా వగైరా బాంధవ్యం, నారింజరంగు చీర, జపాను వరిసాగు, కర్మణ్యే వాధికారస్తే, బడిపంతుళ్ళ బాధలూ, దోమలదండులాటి రచయితల ఉపద్రవం, సుబ్బమ్మ భర్త ముక్కుపొడుం డబ్బా-నీ యిష్టం-నీ ఓపిక - అర్థం ఉండాలనీ, సమన్వయం కుదరాలనీ, ఔచిత్యం కావాలనీ ఇబ్బంది పడబోకు. అంతగా కావాలంటే రెండు కొటేషన్ పుస్తకాలూ-నాలుగు పుస్తకాల కేట్లాగులూ దగ్గర పెట్టుకో.

ఆపాళాన - ఇలాంటి సవాలక్ష విష యాలలో నీకున్న పాండిత్యం జనం నమ్మి- నీపై గురుభావం ఏర్పరచుకుంటారు. నూటికి తొంభైమంది నువ్విచ్చిన పట్టితో కంగారుపడి లొంగిపోతారు. మిగిలిన పది మందితో కొంత చిక్కు వచ్చే మాట నిజమే. వాళ్ళమీద బ్రహ్మాస్త్రం విసరాలి - వాళ్ళు ఇంచుమించు నీ అంత తెలివిగల వాళ్ళు.

"ఎలా స్వామీ."

"ఉజ్బెక్‌స్తాన్ రచయితల్లో గురుతుల్యు డైన గ్రిజంగా కింప్పయ్యర్గ్ స్కాన్‌విస్కీ అన్నట్లుగా ప్రాణి అనేది సృజనాత్మక సంకుల వ్యథావిహారి గనక" అంటూ ఒక వాక్యం ప్రారంభించు. అదివిని మిగిలిన పదిమందీ హడిలి పారిపోకపోతే చెవికోసు కుంటా. అసలు సదరు గ్రిజంగాకింప్ప య్యర్గ్ స్కాన్‌విస్కీ ఉందీ లేందీ బ్రహ్మ దేముడు ఆరా తియ్యలేడు. ఎందుకంటే ఆ ఆ పేరున్నవా డసలు పుట్టలేదు గనక, లేని పేరు చెప్పటం మోసమంటావా? భయప డకు వత్సా, సర్కసుకంపెనీ ఎవరుపెట్టినా గంతులేయాల్సిందే.

మరోమాట. రెండర్థాలొచ్చే మాట లుంటాయి చూడూ. అంటే ఒకర్థం సజా వుగా మామూలుగా వచ్చేది. ఇహరెండోది ఉంది చూశావు - అదే మనకి కావలసింది. దాన్ని అశ్లీలమనూ, ఇంకేమన్నా అను - ఇటువంటి కిటుకులే నిన్ను ఏనాటికైనా మహా రచయితను చేసేది. అలాటి రెం డర్థాలొచ్చే మాటలన్నీ ఏరి ఓ ఎక్సర సైజ్ పుస్తకంలో రాసుకో. కథ కొంచెం చప్పబడుతున్నదన్న అనుమానం రాగానే, తిరగమాత పెట్టినట్టుగా ఇలాటి మాటలు రెండు జోడుగుళ్ళ బారులా వదులు.

అవులిస్తున్న పరంధామయ్య వళ్ళు చురుక్కు మంటుంది. వళ్ళంతా గగుర్పా టుతో వణికి, మనస్సు తొందరిస్తుంది.

ఇంత చేసినా, నీ కథ ముందుకు సాగ నంటుందనుకో. అప్పుడూ - ఏదన్నా ఇంగ్లీషునవల కొనుక్కో. బాగా అర్థంకాక పోయినా, కొంత ఊహించుకోవచ్చు. పేజీలు తిరగెయ్యి. 'తమాషాగా రాశాడే' అనిపిస్తుంది ఎక్కడో ఒకచోట. అంతే శామ్సన్‌ను సుబ్బారాయుడు చెయ్యి, ఎలిజ బెత్‌ను సుబ్బమ్మ చెయ్యి. పదిపేజీలు నీ యిష్టమొచ్చినట్టు నడవనీ - అప్పటికి ఆ సుబ్బారాయుడూ - ఈ సుబ్బమ్మా అనంత దిగంతాలకు సాగిపోవాలని నిశ్చయించు కుంటారు మన కథలో -

కథ మరో నాలుగుపేజీలు పెంచాలనుకుంటే, సుబ్బారావును వర్ణించు ధీరోదాత్త నాయకుడిలా. ఎంతో మహానుభావుడని నిరూపించు. కేవలం ఒక స్త్రీకోసం, పరాయి స్త్రీకోసం, భార్యను వదిలి, అరుగురు బిడ్డల్ని విడనాడి, ఉద్యోగం త్యజించి, ఇంటిని విసర్జించి, నెత్తిన గుడ్డవేసుకొని కలకత్తా మెయిల్లో బయలుదేరి, బొంబాయి చేరుకున్నాడు సుబ్బారావు!- అని ఆపి 'ఏమిటీ త్యాగం'అని ఆశ్చర్యపోయి, కారణం చెప్పటానికి నేనెంత? అని పేరా కంప్లీట్ చెయ్యి.

ఇంకో నాలుగు పేజీలు పెంచాలనుకుంటే, సుబ్బారాయుడు పూర్తిగా మారిపోయాడనీ, ఆకండలు తిరిగిన వళ్ళు, తళతళ మెరిసే పళ్ళు. కిలకిల నవ్వే కళ్ళు. వంకీలజుట్టు, నున్నగా నీలినీడలీనుతూ మెరిసేగడ్డం, టెర్లిన్‌లాల్చీ. ఫిన్లే గ్లాస్కోపంచ. నీ యిష్టం, నీ ఓపిక - నీ పీలు -"

'ఆ పాళాన?'

'ఆ పాళాన - బొంబాయిలో బిజిలీ హోటల్లో ఎయిర్‌కండిషన్ గదిలో, పద్దెందేళ్ళ సుబ్బమ్మా, ముప్పైఏడు వసంతాల సుబ్బారాయుడూ, స్వర్గాన్ని కట్టుకుని - యౌవన సామ్రాజ్యంలో వియంతల్లా.... ఇక్కడ కొంచెం శృతిమించి వర్ణించాలి. చురకలమీద చురకలు పడాలి. అది చదివిన ప్రతి మనిషీ, సుబ్బమ్మనిచూసీ సుబ్బారాయుణ్ణి చూసీ, అసూయపడాలి. భర్తలు క్రూరులనీ, ప్రియులే సజ్జనులనీ ఇందలి నీతి. తేలాలి.

పందిరి మంచంమీద పడుకుని నీ కథ చదువుతున్న పరంధామయ్య దొర్లి క్రింద పడాలి. మరి పది వాక్యాలలో వీధిలోకి దొర్లాలి. కథ చివరికొచ్చేసరికి రోడ్డుపక్క కాలవలో పడిఉండాలి.

'ఇలా వ్రాయి నాయనా! నువ్వు మహా రచయితవు కాకపోతే చూసుకో' అంటూ ముగించాడు పేరింభొట్లు.

'మరి గురుదేవా?' అన్నాడు పిడతంభొట్లు.

'ఏం నాయినా?' అన్నాడు పేరింభొట్లు.

'కథ ముగించటం ఎలాగో మీకు తెలీక, కప్పగంతేసి తప్పించుకుంటున్నారని గ్రహించాను స్వామీ.'

గుర్రపు సకిలింతలా. బిగ్గరగా నవ్వారు గురుదేవులు. అనగా, వారి ముఖం ఆ మాదిరిగా కనపడ్డది. సకిలింపు నేపథ్యం నుంచి వినపడింది.

'సకిలించకండి స్వామీ! నాకా మాత్రం తెలీకకాదు. ఇప్పుడా ముగింపు నేనే చెప్పగలను.'

'అయితే చెప్పు శిష్యా! విని తరిస్తాను.'

శిష్యపరమాణువు పిడతంభొట్లు గురువులా చెప్తున్నాడు.

గురుదేవులు పేరింభొట్లు శిష్యునిలా వింటున్నాడు.

'ఆ పాళాన గురూ! బిజిలీహోటల్లో 626 వ నంబరు గదిలో సుబ్బమ్మ ఒక్కర్తే కూర్చొని ఉంటుంది. సుబ్బారాయుడు గిరజాలు పెంచి, సినిమాల్లో జేరాలని తిరిగి తిరిగి విసిగి డబ్బులేక పెళ్ళాం దగ్గరకి పారిపోతాడు. సుబ్బమ్మ భర్త పరాంకుశం, భార్య అదృశ్యం కాగానే మతిపోయి, మజ్నూలాపాడైపోయి. త్రాగుతూ దేశాల వెంట తిరుగుతూ బొంబాయి జేరి, అదే బిజిలీ హోటల్లో 625 వ నంబరు గదిలో దిగుతాడు. విషాదాన్ని భరించలేక విపరీతంగా త్రాగి, పొరపాటున తనగది అనుకుని 626 వ నంబరు గదిలోకి వస్తాడు.'

'శిష్యరత్నా' మూలిగాడు పేరింభొట్లు.

'ఇంకా అవలేదు గురుదేవా! అప్పుడు సుబ్బమ్మ తనగదిలోకి వచ్చిన తాగుబోతును గుర్తుపట్టింది అతను తనభర్త!-ఎవరో కాదు? సాక్షాత్తూ తనభర్త!! అతన్ని చూసి సుబ్బమ్మ కేకపెట్టలేదు కెవ్వన. వణికి క్రిందపడలేదు-నవ్వింది. నిర్లిప్తంగా!- నవ్వింది వేదాంతిలా!!

'క్షమించండి నా గది అనుకున్నా' అంటూ వెనక్కి తిరిగాడు పరాంకుశం. ఆ మైకంలో అతను భార్యను గుర్తించలేదు.

'మీరు రావలసిన గదిలోకే వచ్చారు' అంది సుబ్బమ్మ.

వెర్రిగా చూశాడు పరాంకుశం.

'రండి. కూర్చోండి. నేనెవర్నో గుర్తించలేదా?' గునిసింది సుబ్బమ్మ.

'స్త్రీవి.'

'ఎవరి స్త్రీని?'

'పరస్త్రీవి.'

సుబ్బమ్మ వళ్ళుమండి గాజుగ్లాసు అతని తలమీద బ్రద్దలుకొట్టింది...ఈ పరాంకుశం మత్తువిడింది.

'ఇప్పుడు చెప్పు నేనెవరో?' అంది సుబ్బమ్మ.

'తెలిసింది,' అన్నాడు పరాంకుశం.

'అయితే రండి.'

'ఎందుకూ?'

'గతంలో తప్పుచేశాను. ప్రస్తుతం పశ్చాత్తాపం చెందుతున్నాను.'

'నువ్వు పరస్త్రీవి.'

'కాదు మీ స్త్రీని. మీ భార్యను. మీరే నా ప్రత్యక్షదైవం.'

'కాదు' నా భార్య చనిపోయింది. నా సుబ్బమ్మ ఇంకలేదు? అంటూ లేచిపోయాడు పరాంకుశం. - ఇలా చేయటం వల్ల సుబ్బమ్మమీద జనానికి కావల్సినంత సానుభూతికూడా కలుగుతుంది - ఎలావుంది గురుదేవా?'

పేరింభొట్లు అనే గురువు మొదలునరికిన చెట్టులా, పిడతంభొట్లు అనే శిష్యపరమాణువు పాదాలపైబడి 'పొరపాటున తెలియక తమని శిష్యుడనుకున్నాను స్వామీ! మీరే నాకు గురుదేవులు!' అంటూ సొమ్మసిల్లిపోయాడు.